





బొల్లిముంత నాగేశ్వరరావు

# సంజాయిషీ

హౌస్ సర్జరీ చేస్తున్న సునీత ఆసుపత్రి నుండి అడుగులు బయటికేసింది. షాంపూ ముంగుర్లు చేత్తో సవరించుకుంది.

ఆకాశం మేఘావృత మయింది. నల్లని కావురు కమ్మింది. ఎక్కడా గాలి కదలిన జాడ లేదు.

'వర్షం వచ్చే ముందు ఇలాగే ఉక్క బోస్తుంది.' ఎవరో అనటం ఆమె వింది. మధ్యాహ్నం ఒంటి గంట.

ఇల్లు దగ్గర్లో ఉండటంతో వేగంగా నడవటం మొదలెట్టింది.

యాంత్రికమైన వాహనాలు రొద చేస్తూ పక్కనే దూసుకు పోతున్నాయి. జనం హడావుడిగా నడుస్తున్నారు. వారి నడకలు రకరకాలుగా, విచిత్రంగా

ఉంటాయి.హాబీకోసం సునీత ఆసక్తిగా చూడటం మొదలెట్టింది.

ఎవరో లావుపాటి మనిషి దొర్లి పోతున్నట్టుగా చకచకా పోతున్నాడు.

మరో సన్నని మనిషి తేలిగ్గా అడుగడుక్కీ పైకి లేస్తున్నాడు.

మిలిటరీ మనిషిలా ఉన్నాడు. యూనిఫామ్‌లో టక్. టక్ అడుగులు వేసుకుంటూ హుందాగా నడుస్తున్నాడు. అడుగులు అటూ, ఇటూ పడటం లేదు. తిన్నగా, ముక్కుకు సూటిగా పడుతున్నాయి.

ఎవరో పాప—పదేళ్ళకు లోపుగాఉంటాయి.బెదిరిన లేడిలా బెరుగ్గా వాహనం వాహనానికీ తప్పుకుంటూ, పక్క దారులు తెలీని పాదాలతో రోడ్డుకు మధ్యగా పోతూంది. బుల్లి బుల్లి పాదాల చిటుకు, చిటుకు అడుగులు చూడటానికి ముచ్చటగా ఉన్నాయి.

అడుక్కునే ఒక కుంటి మనిషి, జీవితానికి తన కేం లేదన్న దానికి సంకేతంగా ఒక పక్కకు ఒరిగిపోతూ, పైకి లేస్తూ నడుస్తున్నాడు. అతని నడక సునీతకు బాధ కలిగించింది.

రిటైర్ అయిన ఉద్యోగిలా ఉన్నాడు. కళ్ళకు జోడు, కాళ్ళకు జోడు, వంగిపోయిన నడుము, వడలిపోయిన బుగ్గలు, చేతిలో సంచి...చిత్రంగా నడుస్తున్నాడు.

తన వంతు కర్తవ్యాన్ని మోస్తున్న ఈ శరీరం ముగించింది. చివరి అధ్యాయం తాలూకు జీవన ప్రస్థానంలో మా వేగం తగ్గిపోయిందన్నట్టు మెల్లిగా పడుతున్నాయి పాదాలు.

ఇంతకూ తన నడక ఎలా ఉందో—మెల్లిగా నవ్వుకుంది సునీత.

జీవితం ఒక మహా నదిలాంటిది.

నది కున్న మూడు దశల మాదిరిగానే జీవితానికీ ఉన్నాయి. చిన్నతనంలో చదువుకున్న విషయాలు ఆమెకు గుర్తు వచ్చాయి.

కొండల లోయల్లోంచి అనేక పాయలుగా నది బయలు దేరుతుంది. ఉరకలెత్తే బలోత్సాహంతో పరగలు కక్కుతూ ముందుకు పోతుంది. మనిషి కున్న మొదటి దశకూడా అలాంటిదే. బాధ్యత తెలీని యౌవనోత్సాహంలో మనసు పరుగులు తీస్తుంది.

నది మైదానానికి చేరుతుంది. విశాలమైన ఆ మైదానంలో మెల్లిగా ప్రవహించాలి. ఇక్కడే దానికి ఆనకట్టలు పడతాయి.

బతుకూ అంతే. విస్తృతమైన జీవిత మైదానం. బాధ్యతల ఆనకట్టలు, శాంతంగా ప్రతిదాన్నీ పరిష్కరించుకుంటూ పోవాలి.

ఈ దేశం సస్యశ్యామల మయ్యేందుకు తన చల్లని హస్తాల్ని నది నలు వైపులకీ ప్రసరిస్తుంది.

జీవిత పరమార్థంకూడా అంతే. ఈ దేశ కల్యాణానికి తన వంతు కర్తవ్యాన్నినాలుగు చేతులా అందించాలి.

ఆనకట్టలు లేని నది తీయని నీరు ఉప్పు నీటిలో కలిసి పోతుంది. బాధ్యతలు లేని జీవితంకూడా అంతే—బూడిదలో కలిసిపోతుంది.

తను దారి పొడుగునా మోసుకొచ్చిన నిక్షేపాన్ని నది డెల్టాగా కూర్చి చివరి శ్వాసను పీలుస్తుంది.

మనిషీ అంతే. తన జీవితానుభవాన్ని క్రోడీకరించి సారవంతమైన డెల్టా లాంటి సందేశాన్ని అందించి చివరి అంకాన్ని ముగిస్తాడు.

ఈ యాత్రలో నదీ ప్రవాహం ఎన్ని రకాలుగా ఉంటుందో, మనిషి నడకకూడా అన్ని రకాలుగా ఉంటుంది.

తన జీవితం ఇప్పుడు విస్తృతమైన దశకు చేరబోతూంది. తను చదివే ఈ డాక్టరీ చదువు రేపు ముగుస్తుంది.

మైదానానికి చేరిన నదీ ప్రవాహంలా తన అడుగులు శాంతంగా పడుతున్నాయని సునీత అనుకుంది.

ఉన్నట్టుండి గాలి దుమారం మొదలయింది. అందరి అడుగుల్లోనూ వేగం హెచ్చింది. అప్పటి వరకూ కాళ్ళ కింద ఉన్న దుమ్ము కళ్ళలో పడటం మొదలయింది. నిర్జీవంగా నేల మీద పడి ఉన్న చెత్త పరకలు చైతన్య మొచ్చిన వింత జీవుల్లా ఆకాశంలో ఎగురుతున్నాయి.

వాన చినుకులు ప్రారంభమయాయి. అనుకోకుండా ఈ వాతావరణంలో వచ్చిన హఠాత్పరిణామం సునీతకు కాస్త ఆశ్చర్యం వేసింది.

దుమ్ము నెత్తి నిండా పడుతూంది. చినుకులు ఉధృతమయాయి.

ఎక్కడైనా కాస్సేపు తల దాచుకోకపోతే చేతిలో ఉన్న పుస్తకాలూ, స్టెతస్కోపూ, తెల్లని కోటూ, తనకు ప్రియమైన నీలాకాశం రంగులో నక్షత్రాల్లా తెల్లని చుక్కల డిజైన్ అమెరికన్ జార్జెట్ చీరా, షాంపూ పట్టించిన తలా అన్నీ వికృతంగా మారిపోతాయని ఆమెకు భయం వేసింది. వేసిందే తడవుగా వెంటనే ఒక షాపులోకి పోయింది.

అ దో మెడికల్ షాపు.

మెడిసిన్ చదివే సునీత మెడికల్ షాపులోకి వచ్చేసరికి షాపుకీపర్ కాస్తంత ఆసక్తిగా గమనించి వెంటనే కూర్చోమంటూ ఒక స్టూల్ వేశాడు. అంతకు ముందే అక్కడికి చేరిన అనేకమంది అలాగే నిలబడి ఉన్నారు. తనకు జరిగిన ఆ ప్రత్యేకమైన గౌరవానికి మనసులో సునీత కాస్తంత మురిసి పోయినా, అందరి మధ్యా కూర్చోటం అంత సభ్యత కాదన్న ఉద్దేశ్యంతో — 'థాంక్స్, అక్కర్లేదు లెండి' అంది.

షాపు కీపరూ, అక్కడి వాళ్ళూ ఆశ్చర్యం వెయ్యటంతో ఆమెకు తప్పలేదు. మెల్లిగా కూర్చుని బయటికి చూసింది.

బజారంతా హడావుడిగా ఉంది. జనమంతా పక్కలకి పట్టుకుంటున్నారు. వాహనాలు మాత్రం మామూలుగానే ప్రయాణం చేస్తున్నాయి. ఎదురుగా ఫుట్‌పాత్ మీద ఏవో ప్లాస్టిక్ సామాన్లమ్ముకునే మనిషి సామాన్లు తడుస్తుంటేవి ఒకచోట గుట్టచేసి మైనం పట్టా లాంటి దేదో మీద కప్పి గట్టిగా పట్టు కున్నాడు. వర్షంలో అతడు మొత్తంగా తడిసి పోతున్నాడు.

దుమ్ము లేవటం ఆగినా గాలి తగ్గ లేదు. షాపు ల్లోకి చేరే జనం ఎక్కువయారు.

ఠక్కున అందరి దృష్టి తన వైపు మళ్ళేట్టు ఒక మనిషి సునీత ఉన్న మెడికల్ షాపులోకి వచ్చాడు.

మనిషి చాలా దీనంగా ఉన్నాడు. పెరిగిన దుమ్ముల్లో జీర్ణమైపోతున్న శరీరం కనిపిస్తూంది. పెరిగిన తెల్లని గడ్డం మాసిపోయి పుడ్డిగా కనిపిస్తూంది. కళ్ళలో కాంతి లేదు. తలకు గుడ్డ చుట్టుకున్నాడు. చేతిలో కర్ర ఉంది. అతను వచ్చి ఒక దరిని నిలబడితే ఎవరికీ అభ్యంతరం ఉండేది కాదు. విరామం లేని దగ్గు తెరలు తెరలుగా వచ్చి అతన్ని మెలికలు తిరిగేట్టు చేస్తూంది.



అక్కడ ఉన్న వాళ్ళంతా జుగుప్సగా అతని వంక చూశారు. అతని రోగ పూరితమైన పొడిపొడి శ్వాసల్లోంచి దగ్గేవ్వుడు కనిపించకుండా బయట పడే భయానకమైన 'మైక్రోబ్స్' గాలి బయటికి పోకి ఆ గదిని మొత్తం ఆవరించుకుని, అనారోగ్యకారణ ధూళి గుండా ఎక్కడలోనికి పోతాయోనని అంతా ఒకేసారి భయపడిపోయారు.

అతని వంక కాస్త అసహ్యంగా కూడా చూడటం మొదలెట్టారు.

సునీత చేతిలోని కర్చీఫ్ ముక్కులకు అడ్డం పెట్టుకుంది.

ఇదంతా గమనించిన మందుల షాపు యజమాని బిగ్గరగా ఆ వ్యక్తిని కసిరాడు.

"ఎక్కడా చోటు దొరకనట్టు—బయటికి నడువు."

ఆ వ్యక్తి మరల వెంటనే బయటికి పోయి షాపు మెట్ల మీద నిలబడ్డాడు. షాపు యజమాని నవ్వుతూ అందరి వంకా చూశాడు.

ఇప్పుడేం ఫరవా లేదన్నట్టు జనమంతా నిట్టూర్చారు. కానీ సునీతకు మాత్రం బయటి మెట్ల



దీవెన

ఫొటో — మోహన్‌సింగ్ ( హైదరాబాద్ )

మీది మనిషి దగ్గు అవ్యక్తమైన ఆవేదనను కలుగ జేసింది.

ఆమె మనసులో బయట లాగానే ఏదో ఆలోచనల అలజడి.

'అతనూ ఈ దేశంలోని ఒక మనిషే. వసుధైక కుటుంబమూ, మానవులంతా సోదరులనే నీతిసూత్రానికి సమయంలో ఇక్కడున్న మనుష్యుల్లో ఏదైనా విలువ ఉంటే అతన్ని కసిరి బయటికి పంపేల్సిన అవసరం ఉండేది కాదు.

అతని శరీరంలో రోగం ఉంది. ఆ రోగానికి సంబంధించిన వైజ్ఞానిక చికిత్సా సూత్రాలు తన మనసులో ఉన్నాయి. ఏ మందు సరిపోతుందో పరీక్షించి చెప్పగానే వాడేందుకు రెడీగా షాపులో రకరకాల మందు లున్నాయి.

ఇవన్నీ క్షణాల మీద జరిగి పోవచ్చు. దగ్గు నుండి అతడు ఉపశమనం పొందవచ్చు. తరవాత తను అతన్ని తీసుకుపోయి దగ్గరున్న ఆసుపత్రిలో మంచి చికిత్స ఇప్పించవచ్చు. ఆ రోగం నుండి అతన్ని విముక్తం చెయ్యవచ్చు.

[illegible] కని జరగ దిది?

సునీత ఆలోచనలు పదును నెక్కుతున్నాయి.

ఆమె మనసులో తమ మెడికల్ కాలేజీ ముందున్న అర తాడెత్తు 'థింకర్' విగ్రహం మెదిలింది. ఆ విగ్రహాన్ని చూపిస్తూ ప్రిన్సిపల్ గారిచ్చిన ఉపన్యాసం కూడా గుర్తుకు వచ్చింది.

* * * *

'డియర్ యంగ్ డాక్టర్స్!

మనిషి ఆటవిక దశనుండి ఆలోచన దశకు చేరిన ఒకానొక మహత్తరమైన మలుపును సూచించేదే మన కాలేజీ ఆవరణలో ఉన్న ఆ థింకర్ విగ్రహం. పచ్చి మాంసం తింటూ, కొండ గుహల్లో ఉంటూ మనిషి జంతువులా జీవనాన్ని సాగించాడు. వేల సంవత్సరాలు గడిచి పోయాయి. గాలి గట్టిగా వీస్తే, వాన కురిస్తే ఆకాశం లోంచి మెరుపు బళ్ళుం దూసుకువస్తే అతను భయపడి పోయాడు. పిడుగు శబ్దం భయంకరంగా మోగినప్పుడు అతని అమాయకమైన గుండెలు అదిరి పోయేవి.

అప్పటి వరకూ తనతో కలిసి ఉన్న జనం అనుకోకుండా ఏవో రోగాలతో గిలగిలా కొట్టుకు చనిపోతే అతని కేమీ అర్థమయ్యేది కాదు. అతని కాంతిలేని కళ్ళు నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయేవి. శతాలు గడుస్తున్నాయి.

అప్పుడప్పుడు ఒక నో రాతి మీద కూర్చుని, గడ్డంకింద అరచేతిని మడిచి పెట్టి మోచేతినిమోకాలి మీద ఆనించి ఆలోచించటం మొదలెట్టాడు.

ఈ జీవితం ఏమిటి? ఈ ప్రాణం ఏమిటి?

ఇక్కడే విజ్ఞానం మొలకెత్తింది. జంతువు నుండి విజ్ఞానమున్న మనిషి తయారైనాడు.

ఆ ఆలోచనాంకురం పెరగటం మొదలైంది. ఎన్నో మహాత్ముల తపస్సుల ఫలితంగా అతని మానసిక విశాల విశ్వంలో చోటు చేసుకున్నాయి. మరికొన్ని తరాలు గడిచాయి. విజ్ఞానమైన ఆలోచన అతనిలో చోటు చేసుకుంది. వచ్చిన రోగాలకు ఆకుపసర్లూ, చెట్ల వేళ్ళూ వాడటం మొదలెట్టాడు.

మన వైద్యశాస్త్రం విజ్ఞానమైన జన్మ అక్కడే ప్రారంభమైంది. ఈ మనిషి చరిత్రలో మొట్టమొదటి మానవుడు మొదటగా వాడుకున్న పసరు వైద్యంలో మన 'జన్మ' ఉంది. యుగాల చరిత్రలో అది పెరిగి పెరిగి ఇప్పటి మన కాలేజీల, ఆసుపత్రుల మహోన్నత రూపాన్ని తీసుకుంది. ఇంతటి ఉన్నతమైన పవిత్ర పరిణామంలో మనం తోటి వారి కెలాంటి సేవ చెయ్యాలి? ఇప్పుడు మనం ఆలోచించాల్సిన అవసరం ఉంది.

మీరూ ఆలోచించండి. ఈ ఉన్నతమైన ప్రవాహాన్ని, ఈ యుగాల గొప్ప అభివృద్ధిని కేవలం డబ్బు విలువల్లోకి మనం దిగజార్చ గూడదు—కాలం కరెన్సీదే కావచ్చు. కానీ మనం మేధావులం. ధనం అనే తెరల్ని చీల్చుకుని బాధితుని వైపుకి మనం పరిగెత్తుకు పోవాలి. రోగంతో మనిషి బాధపడుతుంటే...మనం చూస్తూ ఊరుకుంటే...చరిత్ర క్షమించరాని నేరం చేసిన వాళ్ళమవుతాం. ఆలోచనలేని ఆటవిక దశలో మాత్రమే మనిషి ప్రాణం వదిలే రోగిని చూస్తూ నిస్సహాయంగా ఉండిపోయాడు—మనం కూడా ఉండగలమా? ! లేదు—

కంటికి కనిపించని ఒక తెల్లని చిన్ని అంకురం కాలం కర్కశత్వాన్ని తట్టుకుని మహా వటవృక్షం అవుతుంది. వర్షాకాలపు వరద నీరు దానిమీదుగా పోతుంది. శీతలత్వం విదిల్చే మంచు పొరల్ని అది చీల్చుకు ముందుకు రావాలి. అగ్ని శ్వాసల్ని కక్కే గ్రీష్మం మంటల్లో అది తడారి పోతుంది. మరెన్నో ఇబ్బందులకు లోనై అది మహావృక్షంగా మారుతుంది. చివరికి ప్రకృతి లోని పశుపక్ష్యాదులకు ఆశ్రయంగా నిలుస్తుంది.

దాని ఎర్రని కాయల్ని పక్షులు తింటాయి. పచ్చని నీడలో పరవశించిపోతాయి. ప్రతిఫలాన్ని ఆశించని పవిత్ర సేవ.

ఈ వైజ్ఞానిక యుగంలో మీ రిప్పుడు మహా వృక్షాలు. మీ ఆదరణలో ఎందరో రోగులు తమ బాధల్ని మర్చిపోయే మనుష్యులుగా రూపొందాలి.

మనిషిని, రోగాన్ని గురించి మాత్రమే ముందుగా ఆలోచించండి. ఫీజు గురించి తర్వాత మాత్రమే ఆలోచించండి. అతను ఇవ్వగలిగిన వాడైతే ఇచ్చినంత తీసుకోండి. పేదవాడైతే బ్రతుకు శుభాకాంక్షను మీరే ప్రతిగా చెల్లించి బయటికి అతన్ని సంతోషంగా పంపండి. ఈ నా మాటలు రేపు ఉద్యోగాలు దొరకని ప్రముఖులు డాక్టర్లకు మాత్రమే వర్తిస్తాయి.'

* * * *

సునీత ముఖం ఎర్రగా మారింది. మరెన్నో విషయాలు ఆమెకు గుర్తుకువచ్చాయి. బయటికి చూసింది. వర్షం పడుతూనే ఉంది. దగ్గే మనిషి కనిపించలేదు.

ఆమె గుండె ఒక్కసారి భయంగా కంపించింది! మనసు విషాదంగా పీకింది. వెంటనే లేచింది.

'ఏడీ...ఆ మనిషి కావాలి తనకు. తను వైద్యం చెయ్యాలి.' ఆమె అంతరంగం రోదించింది.

ఒక్కసారి బయటికి వచ్చింది. అతను కనపడలేదు.

'కూర్చోండి...వెళ్తారేం.' షాపుకీపర్ అభ్యర్థనే. ఆమె ఆ మాటలను వినిపించుకోలేదు. బయట కొందరు జనం తడుస్తూనే తిరుగుతున్నారు. దగ్గే మనిషి ఆమెకు కనిపించలేదు.

"ఈ దగ్గుతున్న మనిషి ఎటు పోయాడు?" ఆమె ఆందోళనగా అడగటం అక్కడివారికి ఆశ్చర్యం కలిగించింది.

"అటువైపుగానే పోయాడు." ఒక మనిషి చెప్పాడు. సునీత మెట్లు దిగింది. గబగబా అడుగులు వేసుకుంటూ ముందుకు నడవటం మొదలెట్టింది.

ధారగా వర్షం. తను తడిసిపోయింది. అయినా ఆమె లెక్క చెయ్యలేదు.

ఆ మనిషి కనిపించగానే తను 'తాతగారూ!' అంటూ పలకరించాలి. అతన్ని ఆసుపత్రికి తీసుకు పోవాలి. పరీక్షించాలి. అతన్ని కాపాడాలి?

'ఏమిటె తన కీ పిచ్చి!' సునీత అంతరంగం అనుమానపడింది.

'నో...ఇది పిచ్చికాదు. కర్తవ్యం—మనిషిగా ఒక కర్తవ్యం. మహోన్నత త్యాగాలు తనలో లేకపోవచ్చు.

సత్యాన్వేషణలో ప్రాణా లర్పించినవారు, మానవ కళ్యాణంకోసం శిలువ నెక్కినవారు, మార్పుకోసం ఉరికంబం లెక్కినవారు.

మరెందరో—మహాపర్వతాల్లా చరిత్ర మైదానాల్లో నిలిచిపోయారు. వారంత సాహసమా తను చేస్తుంది.

లేదు. ఒక అనాథకు చిన్ని వైద్యం.

ధైర్యంగా, నిస్వార్థంగా అదీ చెయ్యలేకపోతే ... తనెవరు? తనెందుకు?

సునీత కళ్ళు ల సువిష్కోసం ఆకాశం కుమ్మరిస్తున్న ఆ నీటి ధారల్లో వెదకటం మొదలెట్టాయి.

బజారు మలుపు తిరిగింది. అక్కడ మనుష్యులు గుంపుగా ఉన్నారు. తడుస్తూ కూడా ఏదో ఆసక్తిగా చూస్తున్నారు.

వడివడిగా, మనసంతా అలజడిగా అడుగు వేసుకుంటూ సునీత అక్కడికి పోయింది.

అక్కడి దృశ్యం ఆమెను శిలా ప్రతిమలా కాస్సేపు నిలబడేట్టు చేసింది. వర్షం తగ్గుముఖం పట్టింది.

అదేమనిషి—తలకు గుడ్డ, చేతిలో కర్ర, రక్తం మడుగులో అచేతనంగా పడి ఉన్నాడు. రోడ్డుమీద నీటితో రక్తం జారలుగా పల్లం వైపుకి ప్రవహిస్తుంది.

లారీ క్రింద పడ్డాడనీ, మీదుగా పోయిన లారీ వేగంగా ఎటో దూసుకుపోయిందనీ, వర్షంలో సరిగా నంబరు గుర్తించటం సాధ్యంకాలేదనీ ఎదురుగా ఉన్న షాపు మనిషి గుమిగూడిన జనంలో బిగ్గరగా చెప్తున్నాడు.

'పిడెవడో అనాథలా ఉన్నాడు'_ ఎవరివో మాటలు.

'దిక్కులేని మనిషికి దేవుడే దిక్కని, లారీవాడు దేవుడి దగ్గరికి పంపేశాడండి'_ మరెవరిదో వ్యాఖ్య.

ఆ మాటలకు కొందరు నవ్వారు. మరి కొందరు వింతగా చూశారు.

సునీత అక్కడ నిలువలేకపోయింది.

అవును. అతని చావుకు ఆకాశం మాత్రమే కన్నీరు కార్చింది_

'ఈ అనాథ మరణానికి—
ఈ పాపం ఎవ్వరిదని—
వెర్రి వాన ప్రశ్నిస్తూ వెళ్ళిపోయింది.'

ఆమె కళ్ళలో నీరు.

ఈ పాపంలో తనకూ భాగముంది. ఎవరికి తను సంజాయిషీ ఇచ్చుకోవాలి?

ఆమె అంతరంగం మరల హెచ్చరించింది.

సంజాయిషీ ఇచ్చి చేతులు దులుపుకోవటం కాదు—నీ కర్తవ్యం ఈ దేశంలో చాలా ఉంది. దాన్ని చిత్తశుద్ధితో నిర్వర్తించు.

ప్రశ్నార్థకంగా నీ వైపుకి చూసే మానవత్వానికి నీవు తీసుకోబోయే ఈ నిర్ణయమే నిజమైన సంజాయిషీ—నిజమైన పరిష్కారం.

మెరుపు మెరిసింది. చీకటి గుండెల్లో దిగబడే అగ్ని బల్లెంలా అది కిందికి దిగింది. సునీత కళ్ళలో భవిష్యద్దర్శనం తాలూకూ ఏదో ఆశ!

పట్టణవీథుల్లో ఆమె ప్రవక్తలా అడుగులు వేసుకుంటూ ముందుకుపోయింది. ★

# మానవతా దేవాలయం మహిమాన్విత గాథ

పాశ్చాత్య సాంకేతిక నిపుణులతో పనిలేకుండా భారతీయ ఇంజనీర్లు నిర్మించిన నాగార్జున సాగరం డాంను గురించి అన్ని వివరాలూ తెలుసుకోవాలంటే గోపాలరావుగారి పుస్తకం చదవాలి.

గోపాలరావుగారు ఎవరు? అని మీరు అడగవచ్చు. తెలుగువారికి అఖిల భారత కీర్తి తెచ్చిన కొద్దిమంది ఇంజనీర్లలో ఒకరు. వారి ఇంటి పేరు మాటూరు వారు. మాటూరు గోపాలరావుగారు మొన్న మొన్నటి దాకా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కన్స్ట్రక్షన్ కార్పొరేషన్‌కు అధ్యక్షులు.

నాగార్జున సాగర నిర్మాణంతో మొదటినుంచి ఇప్పటిదాకా వారికి చాలా సన్నిహిత సంబంధం ఉంది. గోపాలరావుగారు కాశ్మీర్‌లోని సలాల్ డాం, ఆఫ్ఘనిస్తాన్‌లోని డాముల నిర్మాణంలోను అపారమైన కృషి చేసినవారు కనక అఖిల భారత ఖ్యాతే కాక అంతర్జాతీయ ఖ్యాతి కూడా వారికి లభించింది.

భారతీయ విద్యాభవన్ ( బొంబాయి ) వారు శ్రీ మాటూరు గోపాలరావుగారు రచించిన ఆంగ్ల గ్రంథం 'నాగార్జునసాగర్‌ను' ఇటీవలే ప్రచురించారు.

ఈ గ్రంథానికి భారత రాష్ట్రపతి డాక్టర్ నీలం సంజీవరెడ్డిగారు పీఠిక వ్రాశారు.

ఈ గ్రంథం మన తొలి ప్రధానీ, ఆధునిక భారత నిర్మాతా పండిత జవాహర్లాల్ నెహ్రూ గారికి అంకితం.

"ఈ పుస్తకం చారిత్రక ప్రాముఖ్యం కలిగి ఉండడంతోపాటు రానున్న తరాలవారికి ఉత్తేజాన్ని కలిగించగలదు" అన్నారు మన రాష్ట్రపతి తమ పీఠికలో.

మానవతా మహాదేవాలయంగా నాగార్జున సాగరాన్ని రచయిత అభివర్ణించారు.

రమారమి నాలుగు వందల పేజీల ఈ గ్రంథంలో కృష్ణానది పుట్టు పూర్వోత్తరాలు, చరిత్ర, భౌగోళిక పరిస్థితి, నాగార్జున సాగర నిర్మాణ విశేషాలు, జలవిద్యుచ్ఛక్తి, నిర్మాతల వివరాలు మొదలైన అనేక అంశాలు విపులంగా చర్చించడం జరిగింది.

రాతితో కట్టిన జలాశయాల్లో నాగార్జున సాగరం ప్రపంచంలో అన్నిటికంటె పెద్దది. సాగర్ నిర్మాణంలో ప్రదర్శించిన సాంకేతిక నైపుణ్యం వివరాలు ఈ పుస్తకంలో లభించినట్లు ఇంక ఏ పుస్తకంలోనూ లభించవు.



ఆచార్య నాగార్జునుని పేరిట వెలసిన నాగార్జున సాగరాన్ని గురించిన విజ్ఞాన సర్వస్వం ఈ గ్రంథం.

ఇంత గొప్ప గ్రంథాన్ని రచించిన శ్రీ మాటూరు గోపాలరావుగారు, ప్రచురించిన భారతీయ విద్యా భవన్ వారు ప్రశంసనీయులు.

"కృష్ణ నాపి నిరుపేదల
తృష్ణ బాపినట్టివారు
విష్ణువుకంటే ఘనులని
వేవోళ్ళ చాటింతును."

—దాశరథి